క్లుప్తంగా

డీపీఓకు సన్మానం



ములుగు : జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దేవరాజును ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు అరవింద్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు సన్మానించారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో డీపీఓను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ములుగు మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్, మరాటి రవీందర్, లింగస్వామి, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



రాకేశ్(ఫైల్)

మంగపేట : మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన ఊడుగుల రాకేశ్ (20) ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. మృతుడి తాత ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాంబాబు మృతి పార్టీకి తీరని లోటు



ఏటూరునాగారం : మండలంలోని శివాపురం పంచాయతీ పరిధి గోగుపల్లికి చెందిన బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు, మాజీ సర్పంచ్ యాలం రాంబాబు బుధవారం మృతి చెందారు. ఈమేరకు రాంబాబు మృతదేహానికి జెడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..రాంబాబు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆమె అన్నారు. మలిదశ ఉద్యమంలో రాంబాబు కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, జగదీశ్, మాదరి రామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబ్యాలలో కంటి వైద్యశిబిరం

టేకుమట్ల : మండలంలోని దుబ్యాలలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ భూపాలపల్లి జిల్లా, లయన్స్ క్లబ్ పరకాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరంతో పాటు అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు చేసి, మందుల అందజేశారు. అలాగే ఆపరేషన్ అవసరమున్న వారికి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అనంతరం జేసీఐ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు ఆరుముళ్ల మాట్లాడుతూ అవయవ దానం వల్ల ఎంతో మందికి ప్రాణం పోసిన వారమౌతామని అన్నారు. మరణాంతరం మట్టిలో అవయవాలు కలిసి పోకుండా ఎంతో మందికి జీవం పోయాలన్నారు. నేత్రదానం వల్ల చూపులేని సుమారు 15లక్షల మంది ఉన్నారని, అందులో సుమారు 60శాతం 12ఏళ్ల లోపు పిల్లలే ఉన్నారన్నారు. అవయవదానం మరో జన్మ అని, అందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పరకాల అధ్యక్షుడు గుంటోజు వెంకన్న, ఎంజేఎస్ అధ్యక్షుడు జగన్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సంగి రవి, మాజీ సర్పంచ్‌లు ఉమేందర్‌రావు, సంపత్‌రావు, స్వేరో మండల అధ్యక్షుడు సంగి రవి, సునీల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి : మండలంలోని వేములపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వేములపల్లి శివారులో బుధవారం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నంబర్ ప్లేట్ లేని రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తు డ్రైవర్లు పారిపోయారు. అనంతరం వీరు వరికోలు గ్రామానికి చెందిన గడ్డం కిరణ్, వీరన్నగా తెలిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకును తరలిస్తే ఎవరిని ఉపేక్షించేంది లేదని తెలిపారు.

నియామకం

చిట్యాల : గ్రామ పంచాయతీ కారోబార్‌ల సంఘం మండల ఇన్‌చార్జ్‌గా లక్ష్మీపూర్ తండాకు చెందిన బానోత్ రాకేశ్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర జీపీ కారోబార్‌ల సంఘం అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేశ్‌కు నియామాక పత్రం అందజేశారు.

చెరువులు,కుంటలు మాయం

- కనుమరుగవుతున్న శిఖం భూములు
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



చెరువు మత్తడి నుంచి కట్ట వరకు కబ్జాకు గురైన బోరునర్సాపురం ఉప్పలనర్సయ్య చెరువు

మంగపేట : మండలంలో చెరువు శిఖం భూములను దర్జాగా కబ్జా చేసి పంటలు సాగుచేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడంతో ఇప్పటికే వందల ఎకరాల చెరువుల శిఖం భూములు కబ్జాకు గురి కాగా పలు చోట్ల చిన్న చిన్న కుంటలు ఆనవాళ్లే లేకుండా పోయాయి. ప్రతి ఏటా వేసవి కాలంలో చెరువుల్లో నీరు లేని సమయంలో శిఖం భూములను కబ్జా చేసి సాగు చేస్తున్నారు. దీంతో చెరువుల్లోకి వర్షా కాలంలో భారీగా నీరు చేరడంతో శిఖం భూముల్లో సాగుచేసిన పంటలు నీటమునగడంతో కబ్జా దారులు తూము షటర్లను ఎత్తుతున్నారు. దీంతో ఆయా చెరువుల ఆయకట్టు భూములకు అందాల్సిన నీటిని బయటకు పోవడంతో రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శిఖం భూములు ఆక్రమణకు గురవుతుంటే అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని, దీని ఫలితంగా మండలంలోని చెరుపల్లి రెవెన్యూ పరిధిలోని కోతుల కుంట చెరువు కబ్జాకు గురై ఆనవాళ్లే లేకుండా పోవడం గమనార్హం. అక్రమార్కులు రాజకీయ పలుకుబడితో శిఖం భూములను కబ్జా చేసి రెవెన్యూ అధికారులకు అమ్యామ్యాలు ముట్ట చెప్పి వారిపేరిట పట్టాలు చేయించుకోవడం గమనార్హం.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

మండలంలోని మల్లూరు అత్త, కోడలు చెరువుల శిఖం భూముల అన్యాక్రాంతంపై ఆయకట్టు రైతులు స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అప్పటి కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఫిబ్రవరి 23న స్వయంగా మల్లూరు చెరువును రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. శిఖం భూములు అన్యాక్రాంతం అవుతుంటే ఏం చేస్తున్నారని రెవెన్యూ అధికారులపై కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు శిఖం భూములను కబ్జాచేసి పంటలు సాగుచేసే వారిపై పోలీసు కేసులు ఎందుకు పెట్టడంలేదని అప్పటి తహసీల్దార్ వీరస్వామిని ప్రశ్నించారు. తాను జిల్లా ఎస్పీతో మాట్లాడుతానని సర్వే నిర్వహించి శిఖం భూములను కబ్జా చేసినట్లు తెలిస్తే వెంటనే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు కేవలం నామమాత్రానికే ఉన్నారని వెంటనే చెరువులలో సర్వే నిర్వహించి శిఖం భూముల హద్దులు గుర్తించి జేసీబీతో ట్రెంచ్ కొట్టించాలని, వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పొచ్చు.

అన్ని చెరువుల్లోను ఇదే పరిస్థితి

మండలంలో మొత్తం 88 చెరువులు ఉండగా దాదాపు 75 శాతం చెరువుల శిఖం భూములు కబ్జాకు గురయ్యాయి. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయం చుట్టు ఉన్న ఐదుకు పైగా చెరువుల్లోని శిఖం భూములు 90 శాతం కబ్జాకు గురవడంతో పేరుకే చెరువులు అన్న చందంగా మారాయి. కబ్జాకు గురైన భూముల్లో కొందరు బడా రాజకీయ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ధనవంతులు ఉండటంతో వారిని అడ్డుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరైతే ఏకంగా శిఖం భూముల్లో జామాయిల్(యూకలిప్టస్) తోటలు పెంచడం ఆశ్చర్యకరం. దీంతో మండలంలోని కమలాపురంలోని ఊరచెరువు, కవ్వాలకుంట చెరువు, చెరుపల్లి పెద్దచెరువు, మంగపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న వెంకన్నకుంట,గొళ్ళకుంట, గంపోనిగూడెం చెరువు, బోరునర్సాపురంలోని మామిడికుంట, ఉప్పలనర్సయ్య చెరువు, తిమ్మంపేట ఊర చెరువు, తిమ్మచెరువులలో వందలలాది ఎకరాల శిఖం భూములు కబ్జాకు గురయ్యాయి.

కబ్జాపై ఇంటెలిజెన్స్ ఆరా

మండలంలో ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటిలో ఎన్ని కబ్జాకు గురయ్యాయి. కబ్జాలో ఎవరైన రాజకీయ నేతలు ఉన్నారా, అందులో ఎవరైనా అధికార పార్టీ పెద్ద తలకాయలు ఉన్నాయా అనే విషయంపై గత కొద్ది రోజుల నుంచి ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. దీంతో మండలంలో హైడ్రా తరహాలో చర్యలు ఉంటాయా అలా జరిగితే పరిస్థితి ఏమిటనే విషయంపై మండలంలో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇప్పటికే శిఖం సాగు చేస్తు ఆయా భూములకు పట్టాలు పొంది బ్యాంకుల్లో రుణాలు పొందిన వారిలో గుబులు రేపుతోంది.

ఆదేశాలు రాలేదు



మల్లూరు అత్త, కోడలు చెరువుల్లో అన్యాక్రాంతమైన శిఖం భూములను గుర్తించేందుకు సర్వే చేపట్టే సమయంలో పలు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ వల్ల ఆలస్యం జరిగింది. ప్రభుత్వం నుంచి కానీ, జిల్లా కలెక్టర్ నుంచి కానీ ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాల వచ్చిన వెంటనే తప్పకుండా పాటిస్తాం.

- మల్లేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్

రేపు వాహనాల వేలం

ఏటూరునాగారం : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఆటోలు, రెండు మోపెడ్‌లు, 31 మోటర్ సైకిళ్లకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 50 శాతం డిపాజిట్ చెల్లించి ఈ వేలంలో పాల్గొనాలని ఎక్సైజ్ సీఐ రామకృష్ణ కోరారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న హరికృష్ణ

వాజేడు : యువత వ్యసనాలకు బానిస కావొద్దని, మత్తు పదార్థాలను యువత దూరంగా ఉండాలని బాలల పరిరక్షణ అధికారి హరికృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ఇన్‌చార్జ్ కె.సుమన్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత ఎదుగుదలను అడ్డుకుంటాయన్నారు. నాగరిక సమాజం ఎంత అభివృద్ధి చెందుతుందో అంతే వేగంగా మత్తు, మాదక ద్రవ్యాల రూపంలో ప్రమాదం పొంచి ఉందన్నారు. సాంకేతికత అందుబాటులో లేని సమయంలో మాదక ద్రవ్యాల వినియోగం లేదన్నారు. నేడు సాంకేతిక రంగం అందుబాటులోకి వచ్చిన తరుణంలో చెడు ఎంత దూరంలో ఉన్నా వెంటనే వ్యాప్తి చెందుతోందని పేర్కొన్నారు. మత్తు,మాదక ద్రవ్యాల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మిషన్ పరివర్తనపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సుదర్శన్, శీనయ్య, తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల కమిటీ ఎన్నిక



నియామక పత్రాలు అందజేస్తున్న భద్రయ్య

గోవిందరావుపేట : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు సమక్షంలో నియమించారు. మండల అధ్యక్షుడిగా సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా దేవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఎలగందుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వంగరి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా కొండి రమేష్, అధికార ప్రతినిధిగా ఎండీ అక్బర్‌కు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ సంస్థ ప్రధాన ఉద్దేశాలను వివరించారు. అవినీతి అక్రమాలకు తావు లేని సమాజం కోసం ఎన్‌హెచ్‌ఆర్సీ చేస్తున్న రాజీలేని పోరాటంలో భాగస్వాములు కావాలని సామాజిక ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని అభినందించారు. జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బలమైన లీగల్ ప్రొసిజర్‌తో కాల్ సిస్టంతో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండేందుకు తమ సంస్థ ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు రాజేందర్, కోడిపాక రవి, తిప్పని కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటకృష్ణ

మంగపేట : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కొమురం జగన్ (పోలీస్ కానిస్టేబుల్) ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం నాయకులు బుధవారం పరామర్శించి, రూ.13,000 ఆర్థికసాయం అందజేశారు. నర్సంపేట పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న జగన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన స్వగ్రామం చింతకుంటలో బుధవారం నిర్వహించిన దశదిన కర్మకు ఉద్యోగుల సంఘం నాయకులు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చింత కృష్ణమూర్తి, మద్దెల అంజయ్య నాయకులు గొప్ప సమ్మారావు, కొమరం నర్సయ్య, మద్దెల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : మండల పరిధిలోని కర్లపల్లి గ్రామానికి చెందిన గాందర్ల సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.3,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తండ కృష్ణ, జాడి హనుమయ్య, గాందర్ల బాబు, దుర్గం సమ్మయ్య, వాసం బాబు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

ములుగు రూరల్ : ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేడు(గురువారం) మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో తెలపాలని ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యంతరాలను ప్రధాన రాజకీయ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉదయం 11.30 హాజరై అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు.

నేడు రాజకీయపార్టీ నాయకులతో సమీక్ష

వాజేడు : ఓటరు జాబితా ముసాయిదాపై మండలంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో నేడు(గురువారం) సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో అభ్యంతరాలు ఉంటే తెలపాలని నోటీసు బోర్డులపై ఓటరు లిస్టును ప్రదర్శించినట్లు తెలిపారు.రాజకీయ పార్టీల నాయకులు నేడు ఉదయం 11 గంటలకు తప్పని సరిగా ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

చిట్యాల : ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ములకల్ల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గోపాలపూర్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదు డీఏలను విడుదల చేసి పెండింగ్ బిల్లులను ఏకకాలంలో చెల్లించాలని, పీఆర్‌సీని ప్రకటించాలని అన్నారు. అలాగే ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. జీపీఎఫ్ బిల్లులు, మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటరామిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మారబోయిన మహేందర్, మండల శాఖ అధ్యక్షుడు కానుగుల రఘుపతి, నాయకులు ఏదుల మనోహర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మల్హర్ : మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో బుధవారం టీఆర్‌టీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ డీఏలను విడుదల చేయలన్నారు.

‘భగీరథ’ పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి గ్రామంలో గల జాతీయ రహదారిపై మిషన్ భగీరథ పైపులైన్ పగిలి తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో ‘భగీరథ నీరు కలుషితం’ అనే కథనాన్ని మంగళవారం సాక్షి దినపత్రిక ప్రచురించింది. ఈ కథనానికి సంబంధిత శాఖ అధికారులు వెంటనే పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్న చోట బుధవారం భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజలు సాక్షి కృతజ్ఞతలు తెలిపారు.

గాడితప్పిన ప్రత్యేకాధికారుల పాలన !

పక్కదారి పడుతున్న పంచాయతీ సొమ్ము

- రికార్డులు మెయింటెన్ చేయకుండానే ఖర్చులు
- ఎంపీఓ తనిఖీలో వెల్లడి
- పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ

గోవిందరావుపేట : ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్ర మంత్రి సీతక్క ఇలాకాలోనే కొంతమంది కార్యదర్శులు ఇష్టారాజ్యంగా తమ చేతి వాటాన్ని చూపిస్తున్నారని బాహటంగానే ప్రచారం సాగుతోంది. గోవిందరావుపేట మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో ఖర్చు చేసిన నిధుల లెక్కలు లేవని సమాచారం. పంచాయతీ ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన మొదటి నెలలోనే క్యాష్ బుక్ రాయకుండానే సుమారు రూ.3లక్షల నిధులను ఖర్చు చేసినట్లు తెలిసింది. ఇదే విషయం ఎంపీఓ తనిఖీలో బహిర్గతం కావడంతో సదరు కార్యదర్శికి మెమో జారీ చేసినట్లు సమాచారం. అయితే ఆ గ్రామ ప్రత్యేక అధికారి మాత్రం ‘ఈవిషయాన్ని ఇంతటితో వదిలేయ్యండి.. మీరు ఇచ్చిన మెమోకు వివరణ అవసరం లేదని..అప్పటి జిల్లా పంచాయతీ ఇన్‌చార్జ్ అధికారి నా మిత్రుడే కాబట్టి నేను మేనేజ్ చేసుకుంటానని’ సదరు కార్యదర్శికి వత్తాసు పలుకుతున్నట్లు స్థానికంగా చర్చనీయాంశమైంది. సర్పంచ్‌లు, పాలక మండలి సభ్యులు లేకపోవడంతో గ్రామ పంచాయతీల పాలన, నిధుల దుర్వినియోగం ఏ మేరకు కొనసాగుతుందో ఈ ఒక్క గ్రామ పంచాయతీ నిర్వహణే అద్దం పడుతుంది. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ప్రత్యేక దృష్టి సారించి నిధులు దుర్వినియోగమైన గ్రామ పంచాయతీల పై ఆరా తీయాలని, పంచాయతీ సొమ్మును పక్కదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(ఎం) : సీజనల్ వ్యాధులతో గొత్తికోయ గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని తొర్రి చింతలపాడు గొత్తికోయగూడెనికి ట్రాక్టర్‌లో వైద్యసిబ్బందితో కలిసి ఆయన వెళ్లారు. ఇంటింటా ఫీవర్ సర్వేను నిర్వహించారు.చిన్నారులకు, గర్భిణులకు టీకాలు వేశారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలని గొత్తికోయలకు సూచించారు. హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఏఎన్ఎంలు శోభ, అనురాధ, స్వప్న, వజ్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

‘పాత పెన్షన్’ను పునరుద్ధరించాలి



డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

టేకుమట్ల : సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరేశం అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ మండల బాధ్యులు రమేశ్ ఆధ్వర్యంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు పెండింగ్ డీఏ కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయం, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేయకూడదని అన్నారు. అలాగే విద్యారంగ సమస్యలతో పాటు, పెండింగ్ సమస్యల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం తాత్కాలిక ప్రతిపాదికన విద్యావలంటీర్లను నియమించి ఉపాధ్యాయ ఖాళీ సమస్యలను తొలగిస్తే విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించిన వారు అవుతారని అన్నారు. అన్ని పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ బాధ్యులు పహీం మోహిన్, తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

గోవిందరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో ఎంపీడీఓ జవహర్ రెడ్డి, ఎంపీఓ శరత్ బుధవారం పాల్గొన్నారు. పస్రా పంచాయతీలోని సెయింట్ మేరీ స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని ఎంపీడీఓ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తడి,పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మోట్లగూడెం గ్రామ పంచాయతీ పరిధి ప్రాజెక్ట్ నగర్‌లో ప్లాస్టిక్ వాడొద్దని గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడకూడదని అన్నారు. కార్యక్రమంలో పూనెం శరత్, శ్వేత, అంజుం, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవలో ఎంపీడీఓ జవహర్ రెడ్డి



ప్రాజెక్టు నగర్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ

గోదావరిలో గణపతుల నిమజ్జనం



వాజేడు: నృత్యాలు చేస్తున్న నిర్వాహకులు



వెంకటాపురం(కె): గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ఏటూరునాగారంలో..

వాజేడు : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని బుధవారం గోదావరిలో ఘనంగా నిర్వహించారు. 11 రోజుల పాటు పూజలందుకున్న గణపతిని మేళా తాళాలతో ఊరేగించారు. జంగాలపల్లి గ్రామానికి చెందిన కల్లూరి హరిబాబు రూ.25,001కు లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం వినాయకులను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సేవాయూత్, పోచమ్మ ఆలయం పరిధిలోని వినాయకుడి నిమజ్జన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గణపతిని ప్రత్యేక రథంలో అలంకరించి డప్పుచప్పుళ్లతో కోలాటంతో గంగమ్మ ఒడికి సాగనంపారు.

వెంకటాపురం(కె) మండలంలో..

వెంకటాపురం(కె) : మండల వ్యాప్తంగా గణపతి నిమజ్జనాలను బుధవారం ఉత్సవ కమిటీల నిర్వాహకులు బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్, శివాపురం వీధిలోని విగ్రహాలను వెంకటాపురం మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించి, పాత్రాపురం పాలెం వాగులో నిమజ్జనం చేశబూరు. శివాపురం వీధిలోని గణనాథుడి లడ్డూను రూ.22,016రు పాయం సతీశ్ కుమార్ దక్కించుకున్నారు.